
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH



# మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి ! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
**(P.O. Box 80) Seshagiri Rao St.**
**KAKINADA-533 004**

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రస్సులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

**Printed at Razan Electric Press, Kakinada-1.**

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 జనవరి 1992 సంచిక 6


## సంపాదకీయము

### యువ తలిదండ్రులకు సలహా

( Advice to Young Parents )

పిల్లలు గల యౌవన తలిదండ్రులకు నావి కొన్ని సలహాలు—ఇటువంటి సలహాలు సాధారణంగా తృణీకరింపబడును; అయినను వీటిని తెలివిగా ఆలోచించి శ్రద్ధతో అనుసరించెదరని ప్రార్థనాపూర్వకముగా విన్నవించుకొనుచున్నాను. నేను కూడ ఎదిగిన పిల్లలకు తండ్రినై యుండి మనుమలను కూడా కలిగియుండి మీతో మాటలాడుచున్నాను. నేను చెప్పుచున్నవి జీవముగల దేవుని మాటలను ఆధారము చేసికొని చెప్పుచున్నాను గనుక నేను చూచిన వాటిని అనుభవపూర్వకముగా తెలిసిన వాటిని చెప్పుటకు పూనుకొనుచున్నాను.

1. దేవుడు మీకు యిచ్చిన సంతానము నిమిత్తము ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలయునని మొదటిగా సలహా యిచ్చుచు

చున్నాను. పిల్లలు దేవుడిచ్చు గొప్ప సంపద యని యిప్పటికయినను గ్రహింపవలయును. పిల్లల యెడల ఆయన మీకు బాధ్యత యిచ్చె నని కూడ తెలుసుకొనవలయును. మీరు ఆ పిల్లలను ప్రేమించి వారి అవసరము లన్నియు సంతోషముగా తీర్చుట మీ బాధ్యతయై యున్నది. ఇంత వరకు మీరు నాతో ఏకీభవిస్తారని తెలుసు.

2. అపొస్తలుడు పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6 : 4లో చెప్పిన విధముగా మీ పిల్లలను ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను పెంచమని నా సలహా. అయితే మీరు క్రైస్తవులు అనగా క్రీస్తు సంఘ సభ్యులు కాకపోయినచో ఆ విధముగా పిల్లలను పెంచుట అసాధ్యము. తలిదండ్రులలో ఒకరు క్రైస్తవులయి మరియొకరు కాక పోయినను కూడ కుదరదు. ఇటువంటి స్థితిలో తలిదండ్రులు చేయవలసిన తెలివయిన పని ఏమనగా—పిల్లలకు ఆత్మీయ శిక్షణ అవసరమనియు, వారిని పెంచుటలో దేవుని సహాయము అవసరమనియు గ్రహించి, యిరువురు కూర్చొని శ్రద్ధగా ఆ విషయమై చర్చించు కొనవలయును. నిత్యము బైబిలు పఠిస్తు క్రీస్తు సంఘ ఆరాధనకు వెళ్లుటకు తీర్మానించుకొన వలయును. అట్లు కొంత కాలము చేసినచో దేవుడు మీనుండి ఏమి కోరుచున్నాడో గ్రహింపగలరు. అప్పుడు మీరు సువార్తకు విధేయులై రక్షింపబడి సంఘముతో చేర్చబడుదురు. అప్పుడు యిరువురు క్రైస్తవులుగా మెసలి ఐక్యముగా వుండి మీ పిల్లలను నిజముగా దేవుని భయభక్తులయందు పోషించి బోధించి పెంచగలరు. ఏ విషయములోనయిన సహాయ సహకారములు కావలసినచో దగ్గరలో నున్న క్రీస్తు సంఘము యొక్క సలహా తీసుకొనుటకు వెనుతీయకుడి.

3. రక్షింపబడి సంఘములో యిదివరకే చేర్చబడిన తలిదండ్రులకు నేనిచ్చు సలహా ఏమనగా—మీ పిల్లలను ప్రతి ఆదివారము

ఆరాధన దినమున బైబిలు తరగతులలో పాల్గొనులాగున తీసికొని రావలయును. మీరు అట్లు చేయుచున్నారని తలంచుచున్నాను. అట్లు చేయనిచో మీరు చాల విలువయిన సమయము పాడుచేయుచున్నట్లే. ఖచ్చితముగా మీరు మీ పిల్లలను బాగుగా చదువు చెప్పని స్కూలునకు పంపుటకుగాని, వారి భవిష్యత్తును పాడుచేయుటకు గాని యిష్టపడరు. అయితే మీరు వీటన్నిటికంటె వారి ఆత్మీయ సంక్షేమము మరీ ముఖ్యమని గ్రహించాలి. నిజానికి దేవుని వాక్య జ్ఞానమునందు పిల్లలను పెంచుటకు యిష్టపడనివారు ఎవ్వరు ఉండరు. వారి చిన్నతనములోనే ఇటువంటి జీవిత సరళికి అలక్ష్యము చేసినచో, వారి పెద్దతనములో మీరు చేసే పొరపాటుకు మీ వృద్ధాప్యములో చింతించవలసి వచ్చును. మీరు జీవనాధారమైన శిక్షణ యివ్వక పోవుటవలన క్రమక్రమముగా వారిలో దేవుని యెడల ఆయన చిత్తము యెడల నిర్లక్ష్యము పెరుగును. ఆఖరుకు వారు దేవునికి అవిధేయులై ఇల్లు విడచి తిరుగుచు దేవుని ఆరాధనకు హాజరు కాకుండ పోదురు. అటు తరువాత వారి భవిష్యత్తు వారి పిల్లల భవిష్యత్తు ఎట్లుండును? తరువాత జరుగు పరిణామములకు మీరు విచారింతురు. దానంతటికి మీరే బాధ్యత వహించవలసి యుందురు. మీరు మీ పిల్లలను బైబిలు తరగతులకు, ఆరాధనకు తీసుకొని వచ్చినంత మాత్రమున మంచి మార్గమున తిరుగుదురను నమ్మకము లేదు. అన్నిటికంటె ముఖ్యముగా చిన్నతనములోనే వారికి దేవుని యెడల విధేయత, విశ్వాసమును గూర్చి శిక్షణ అవసరము.

4. నేను మీకిచ్చు సలహా ఏమనగా ఒకరి యెడల ఒకరికి గౌరవము ప్రేమ కలిగియున్న నిజమైన క్రైస్తవ వాతావరణము కలిగియున్న గృహములలో పెరుగుటకు మీ పిల్లలకు అవకాశము యివ్వవలెను. క్రమశిక్షణలోను, మిమ్మలను గౌరవించే విధంగాను వారికి శిక్షణ యిచ్చి వారికి కొన్ని బాధ్యతలను అప్పగించవలెను,

క్రమశిక్షణలో పెట్టునప్పుడు వారికి ఎక్కువ భారము లేకుండ నుండు లాగున చూచుకొనవలెను. ఎఫెసి 6 : 4 ప్రకారం వారికి కోపము రేపక, ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి. ఆ విధంగా మీ గృహంలో అందరు ఐక్యతగా కలసి పని చేయుచు ప్రశాంతముగా సంతోషముగా వుండేలాగున తీర్చి దిద్దుకొనవలయును.

5. గృహములో క్రైస్తవ్యమును అభ్యాసము చేయవలెను. బంధుత్వాల మధ్య క్రైస్తవ విధానములను పాటించవలెను. మీ పిల్లలకు మీరు మాదిరిని చూపవలెను. ఆదివారము ఆరాధనను నిర్లక్ష్యము చేయుట, ఈ లోకముననుసరించి నడచుకొనుట చేయ రాదు. మీరు చేయు పనిలోను, వినోద విహారాలలోను, మీ స్నేహి తులతో గాని, పొరుగువారితో గాని వ్యవహరించేటప్పుడు పరులు మీలో నిజమైన క్రైస్తవుని లేక క్రీస్తును చూడగలగాలి.

6. పిల్లలు తొందరగా పెద్దవారగుదురు గనుక మీరు ఆశించు నది వారి ద్వారా మీరు ఉండగనే పొందవలెనని చెప్పుచున్నాను. ఒక రోజున మీరు అకస్మాత్తుగా భవిష్యత్తులో ఒంటరి యగుదురు. పిల్లలు మంచి జ్ఞాపకాలను నెమరు వేసుకొనేలాగున మీ గృహము లను తీర్చి దిద్దుకొనవలెను.

ఇప్పుడు చెప్పండి, నేను యిచ్చు సలహాలను గూర్చి మీరేమనుకుంటున్నారు? ఇది అంతా చెడ్డదా? మీరు వీటితో ఏకీభవిస్తు న్నారా? లేదా? నేను యిచ్చు సలహాలు మీకు, మీ పిల్లలను మంచి జీవితములో నడుపుటకు ఉపయోగపడునని తలంచుచున్నాను.

—జె.సి. ఫోట్.

—o—

## కాలగమనంలో క్రైస్తవ్యం

(ఫిలి 4 : 4-7).

క్రీస్తు శకంలో వచ్చింది-మరో సంవత్సరం
కాలగమనంలో క్రైస్తవుల కిది హితవత్సరమైతే,
12 మాసములు పరిశుద్ధులముగ నడుచుకుందాం
52 వారములు యేసు నామంలో పాడి, వేడుకుందాం
366 దినములు సత్యవాక్యం చదివి ధ్యానించుదాం
8784 గంటలు ప్రేమ కలిగి క్రీస్తులో ఎదుగుదాం
527040 నిమిషాలు శిరస్సుకు లోబడి జీవించుదాం
క్షణాక్షణం రక్షణ కర్తను స్మరిస్తూ కీర్తించుదాం
స్పందించిన హృదయాలతో ప్రభువులో ఆనందించుదాం
ఆప్రభువే వస్తే, పిలిస్తే, ఈగుడారాన్ని వదలి పైకిపోదాం!

—సామ్యూల్ జాన్ మేడిది, కోణితివాడ.

---

## క్రైస్తవుడు ఎవరు?

(WHO IS A CHRISTIAN ?)

క్రైస్తవుడు అను పదము కేవలం మూడుసార్లు మాత్రమే బైబిలు గ్రంథ మందు కనబడును. అపొస్తలుల కార్యములు 11:26లో "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" అని లూకా వ్రాసాడు. "అగ్రిప్ప - ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే అని పౌలుతో అనెను." (అపొ.కా. 26 : 28). "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు

సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (1 పేతురు 4 : 16). ఈ సందర్భము లన్నింటిలో క్రైస్తవుడను పదము వ్యక్తిగతంగా క్రీస్తు శిష్యులకు వర్తిస్తుంది. క్రైస్తవుడు ఎవరు అను విషయముపై చాలా తప్పుడు అభిప్రాయము గలిగి, తప్పుడు బోధ ప్రబలి ఉంది కనుక క్రైస్తవుడు ఎవరో తెలిసికొందము.

1. పాత నిబంధనలోని మహాపురుషులు క్రైస్తవులు కాదు :- నోవహు, అబ్రహాము, ఇస్సాకు, యోసేపు, దావీదు, దానియేలు, వీరందరు దైవభక్తి గలవారు. దేవుని ఆజ్ఞల ననుసరించి నడచుకొన్న వారు. కాని వారు క్రైస్తవులు కారు, క్రైస్తవుడు అను పదము పాత నిబంధనలో ఎవ్వరికి వర్తించదు.

2. నీతిమంతు లందరు క్రైస్తవులు కారు :-నీతి అనునది క్రైస్తవునికి ఉండాలి. కాని కేవలము నీతి ఒకనిని క్రైస్తవునిగా చేయదు. కొర్నేలి క్రైస్తవుడు కాకముందు అతడు నీతిమంతుడు, భక్తిపరుడు. ధర్మము చేయుచుండెడివాడు (అపొ.కా. 10 : 1-2).

3. నిష్కపటమైన మనస్సు గల వారందరు క్రైస్తవులు కారు :-నిష్కపటమనునది క్రైస్తవునికి ఉండవలసిన లక్షణము. ఒకడు నిష్కపటమైన మనస్సు గలిగియున్నను అతడు క్రైస్తవుడు కాడు. తార్సువాడైన సౌలు శిష్యులను హింసించినప్పుడు అతడు నిష్కపటమైన మనస్సు కలిగి యుండెను. ఎందుకనగా - పౌలు మహాసభ వారిని తేరి చూచి సహోదరులారా, నేను నేటి వరకు కేవలము మంచి మనస్సాక్షి గలవాడనై దేవుని యెదుట నడచుకొనుచుంటినని చెప్పెను (అపొ. కా. 24 : 1). "నజరేయుడైన యేసు నామమునకు విరోధముగా అనేక కార్యములు చేయవలెనని నేననుకొంటిని; యెరూషలేములో నే నాలాగు చేసితిని. నేను ప్రధాన యాజకుల వలన

అధికారము పొంది, పరిశుద్ధులను అనేకులను చెరసాలలో వేసి, వారిని చంపినప్పుడు సమ్మతించితిని; అనేక పర్యాయములు సమాజ మందిరము లన్నిటిలో వారిని దండించి వారు దేవదూషణ చేయునట్లు బలవంత పెట్టచూచితిని. మరియు వారి మీద మిక్కిలి క్రోధముగలవాడనై యితర పట్టణములకును వెళ్ళి వారిని హింసించు చుంటిని" (అపొ. కా. 26:9-11). సౌలు ఈ పని చేయునప్పుడు తానేదో మంచి పని చేయుచున్నానను ఉద్దేశ్యము కలిగియుండెను. ఎందుకనగా అతడు "నేను మన మతములోని బహు నిష్ఠగల తెగను అనుసరించి, పరిసయ్యుడనుగా ప్రవర్తించినట్లు చెప్పగలను" (అపొ.కా. 26:4) అని అన్నాడు. అతడు మంచి మనస్సాక్షి గలిగి నిష్కపటంగా జీవించుచుండెను. అయినను అతడు అప్పుడు క్రైస్తవుడు కాడు. (తరువాత క్రైస్తవుడైనాడు). ఆలాగే నీవు మంచి మనస్సాక్షి గలిగి నిష్కపటంగా జీవించుచుండవచ్చును, అయినను నీవు క్రైస్తవుడవు కావు.

4. మత సంబంధమైన భక్తిగల వారందరును క్రైస్తవులు కారు :-బయలునకు ప్రవక్తలైన నాలుగు వందల మంది, ఆషేరాదేవి ప్రవక్తలైన నాలుగు వందలమంది దేవతాభక్తి కలిగి బలులర్పించే వారు (1 రాజులు 18వ అధ్యా). ఎఫెస్సు వారు అతి దేవతాభక్తి కలిగియుండిరి (అపొ.కా. 19:23-41). కాని వారు క్రైస్తవులు కారు. యూదులలోని ఒక తెగవారైన సద్దూకయులు దేవదూతలు, మృతుల పునరుత్థానము లేవని నమ్ముచు మత సంబంధమైన భక్తి కలిగి యుండిరి. అయినను వారు క్రైస్తవులు కారు. భక్తిలేనివారు క్రైస్తవులుగా ఉండలేరనునది వాస్తవమే కాని భక్తిగల వారందరు క్రైస్తవులు కారు. మతశాఖలలోని అనేకులు భక్తిగలవారు. కాని వారు క్రైస్తవులు కారు.

5. యేసుక్రీస్తు సువార్తకు విధేయుడైన వాడు క్రైస్తవుడు:- క్రీస్తు సువార్త రక్షించుటకు దేవుని యొక్క శక్తియై ఉన్నది. కనుక ఒకడు రక్షింపబడాలి అంటే క్రీస్తు సువార్తకు విధేయుడు కావాలి. అనగా ఆయన వాక్యము విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి (రోమా 10:13-17, 1 : 16, మార్కు 16 : 16, అపొ.కా. 2 : 38, 17 : 30-31, రోమా 10:9-10, గలతీ 3:26-27). ఇలా చేసినవాడు క్రీస్తు రక్తములో కడుగబడినవాడై, పాప క్షమాపణ నొంది దేవుని కృపవలన రక్షింపబడి సంఘములో చేర్చబడును (అపొ.కా. 2:41-47).

6. క్రైస్తవుడు నూతన సృష్టి:-ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన తరువాత అతడు తిరిగి జన్మించినవాడై నూతన సృష్టి అవుతాడు. పౌలు-"కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను". (2 కొరింథీ 5 : 17) (యోహాను 3:1-5, రోమా 6:3-4 కూడా చదవండి). ఒకవేళ నీవు నూతన సృష్టి కానియెడల నీవు నిజంగా క్రైస్తవునివి కావు.

7. క్రైస్తవుడు క్రీస్తు శరీరంలోని అవయవము :-క్రైస్తవుడు క్రీస్తు శరీరములోని ఒక అవయవము. దేవుని రాజ్యములో ఒక పౌరుడు. క్రీస్తు అను ద్రాక్షావల్లిలో ఒక తీగె. కొలస్స 1 : 18 నుండి శరీరమనగా క్రీస్తు సంఘము అని తెలిసికొనగలము. రోమా 12:5లో-"అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకని కొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము" అని పౌలు వ్రాసెను. కొలస్సయి 1:13లో క్రైస్తవులు దేవుని కుమారుని యొక్క రాజ్య నివాసులని తెలిసికొనగలము. మరియు యోహాను 15:6లో ద్రాక్షవల్లియైన క్రీస్తులో తన శిష్యులు తీగెలు అని చూడగలము.

8. క్రీస్తుకు చెందినవాడు క్రైస్తవుడు :-పౌలు ఇలా చెప్పు చున్నాడు—"మనము బ్రతికినను చనిపోయినను ప్రభువు వారమై యున్నాము" (రోమా 14:8). "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్న దని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1 కొరింథీ 6:19-20). నీవు క్రీస్తుకు చెందినవాడవు కానిచో, ఆయన శరీర అవయవము అనగా క్రీస్తు సంఘ సభ్యుడవు కానిచో, నిశ్చయముగా నీవు క్రైస్తవుడవు కావు. కనుక నీవు క్రైస్తవుడవు ఎందుకు కాకూడదు?

—వి. జె. బెన్‌సన్, హైదరాబాదు.

---

# నీ నమ్మిక తప్పిపోకుండునట్లు

## (That Thy Faith Fail not)

### లూకా 22 : 31-32

క్రొత్త నిబంధన గ్రంథమంతయు మానవుడు విశ్వాసము చేతనే రక్షింపబడునని చెప్పుచున్నది. ఈ విషయమును గూర్చి చాల వచనములీ గ్రంథమందు గలవు గాని ముఖ్యముగ మూడు వాక్యములను గూర్చి తెలిసికొందము. కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచియుండును (యోహాను 3 : 36). యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు (రోమా 10 : 9). దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా

పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3 : 16).

## విశ్వాస మనగా ఏమిటి

విశ్వాస మనగా ఏమిటి? విశ్వాస మనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువునై యున్నది (హెబ్రీ 11 : 1). ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే (ఎఫెసి 4 : 5). ఆయన పునరుత్థానము వలన సర్వాధికారము ఈయబడి యున్నదని మత్తయి 28 : 18లో చూడగలము. బైబిలు గ్రంథమందు వ్రాయబడిన ఆయన మాటలను మనము నమ్మవలెను (యోహాను 20 : 31-32). ఆయన అపొస్తలుల ద్వారా ఆ వాక్యము మనకు తెలియపరచబడినది (యోహాను 17 : 20-21). దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగ సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది (2 తిమో. 3:16, 17) దైవ గ్రంథమందు విశ్వాసమును పొందగల విషయములు గలవు. ఈ విశ్వాసము ఒక్కసారే పరిశుద్ధులకు బయలుపరచబడెను (యూదా : 3).

ఇది నూతన నిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించేదిగా యున్నది. ప్రియులారా, మీరు విశ్వసించు అతి పరిశుద్ధమైన దానిమీద మిమ్మును మీరు కట్టుకొనుచు, పరిశుద్ధాత్మలో ప్రార్థన చేయుచు, నిత్య జీవార్థమైన మన ప్రభువగు యేసుక్రీస్తు కనికరము కొరకు కనిపెట్టుచు, దేవుని ప్రేమలో నిలుచునట్లు కాచుకొని యుండుడి (యూదా : 20). అవిధేయతను అవిశ్వాసముగ దేవుడు పరిగణించును. ఐగుప్తు దేశమునుండి ఒక జనాంగమును రక్షించిన తరువాత వారియొక్క అవిధేయతను బట్టి ఆ జనాంగమును నశింప జేసినట్లు మనము జ్ఞాపకము చేసికొన గలము (యూదా : 4).

## అవిధేయత అవిశ్వాసమే

దేవుడు అవిధేయతను అవిశ్వాసముగ పరిగణించుననుట సత్యము. హెబ్రీ 11వ అధ్యాయ మంతయు తన విధేయత ద్వారా మానవుడు దేవుని యెడల తనకు గల విశ్వాసమును ధృవ పరచుకొనెను. అబ్రాహాము విశ్వాసులకు తండ్రియని పిలువబడెను (గలతి 3:7). తన కుమారుడైన ఇస్సాకును బలిగా ఈయమని చెప్పుటలో దేవుడు అబ్రాహాము యొక్క విశ్వాసమును పరీక్షించెను (ఆది 22 : 1). కనుక దేవుడు మన విశ్వాసమును పరీక్షించును (యాకోబు 1:3-4). మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు అది మహానందమని యెంచుడి. మన విశ్వాసము యదార్థమైనదిగా యుండాలి. అబ్రాహాము విశ్వాసము పరీక్షింపబడినట్లుగ మన విశ్వాసము పరీక్షింపబడాలి. విశ్వాసము పరీక్షింపబడు స్థలమును గూర్చి చదువుదము (1 పేతురు 1:3-6). విశ్వాసము ద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీ కొరకు, ఆస్వాస్థ్యము పరలోకమందు మీ కొరకు భద్రపరచబడి యున్నది. శ్రమల ద్వారా మన విశ్వాసము పరీక్షింపబడాలి. హెబ్రీ 11వ అధ్యాయములోని విశ్వాస వీరుల యొక్క జయజీవితములు మనకు సవాలుగ వ్రాయబడినవి.

ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘము వలె మనలను ఆవరించియున్నందున మనము కూడ ప్రతి భారమును, సులువుగా చిక్కులు పెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు (హెబ్రీ 12:1-2). సహించనవారమైతే ఆయనతో కూడ

ఏలుదుము. ఆయనను ఎరుగమంటే మనలను ఆయన ఎరుగనను (2 తిమోతి 2:12). పేతురుకు గొప్ప విశ్వాస పరీక్ష కలిగింది. యేసు మృతులలోనుండి లేచునని పేతురుకు తెలియదు. యేసు మృతులలోనుండి లేచెనని నమ్ముట గొప్ప విశ్వాసమునకు చుక్కాని. యేసు పేతురుయొక్క విశ్వాసము తప్పిపోకుండునట్లు చేసిన ప్రార్థన ఫలితముగా పెంతెకొస్తు దినమున పేతురు పునరుత్థానుడైన యేసును ప్రకటించగలిగెను. సత్యసువార్త మీ ముందుకు తీసుకురాబడింది. వేల కొలది ప్రజలు ఈ సువార్తకు విధేయులగుచున్నారు. మీరు విశ్వాసములో తప్పిపోయారు. వరదల వలన సమస్తము నాశనమైపోయింది. నాకు యేవిధమైన సహాయము లేదు అని నాకు వ్రాయు ఉత్తరముల విషయ మేమిటి? దేవుని వాగ్దానములను మీకు తెలియజేయుటలో ఒక గంట గడుపగలను. ఆవగింజంత విశ్వాసముంటే మనము పర్వతములను కదలింపగలమని యేసు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసుకొనండి. ఈ ఒకే విశ్వాసము భారతదేశమునకు యిదివరకు రెండు సార్లు తీసుకురాబడింది. భారత సహోదరులకు విశ్వాస విషయమైన అవగాహన లేనందున అది జయకరము కాలేదు.

చాలమంది విశ్వాసమును వృద్ధి చేసుకొనుచున్నందున యిపుడు దేవుని సేవ ఎంతో అభివృద్ధి చెందుచున్నది. భారతదేశములోని క్రీస్తుసంఘమునకు విశ్వాసము లోపించినందున మృతతుల్యముగా యున్నదని చెప్పుదుమా, లేక భూమిమీద మరి యే యితర ప్రాంతము కంటెను అభివృద్ధిలో యున్నదని చెప్పుదుమా?

దీనికి జవాబు మీ విశ్వాసము లేక అవిశ్వాసమే.

నాకు యేవిధమైన సహాయము లేదని మీరు చెప్పుట నేను మరియొకసారి వినకూడదు. మనము వినియోగించుకొనవలసినది ఒకే ఒకటి యున్నది. అది విశ్వాసమే (గలతి 5:6).

మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు (యోహాను 14:15). బహు నమ్మకస్థుడైన సేవకుని దేవుడు తన పని కొరకు వినియోగించుకొనును (మత్తయి 25:21).

మరణమువరకు నమ్మకముగా యుండుము. నేను నీకు జీవ కిరీట మిచ్చెదను (ప్రక. 2 : 10).

—జె. సి. బెయిలీ.

---

# పాపము మరణము

**( Sin and Death )**

భక్తుడైన యోబుకు అనేక శ్రమలు కలిగాయి. "ఈ సంగతులలో ఏ విషయమందును యోబు ఏ పాపము చేయలేదు, దేవుడు అన్యాయము చేసెనని చెప్పలేదు" (యోబు 1 : 22). దేవుడు వారికేదో అన్యాయం చేసేసాడని చాలమంది దేవుని నిందిస్తారు. పిల్లవాడెవడైనా చనిపోతే, "దేవుడు మాకీ అన్యాయం ఎందుకు చేసాడు ?" అని తలిదండ్రులు అడుగుతారు. ఎవరిదైనా ఇల్లు కూలిపోయినా, కాలిపోయినా "దేవుడు మీకెందుకు దీనిని జరుగనిచ్చాడని" మిత్రులు అడుగుతారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే శిక్ష తప్పదు

ప్రాకృతిక ప్రపంచములోని సంగతులను దేవుడు ప్రకృతి సూత్ర బద్ధము చేసాడు. మానవుని పాప మతని మరణాన్ని కొని తెస్తాది. "అందరును పాపము చేసి దేవు డనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3 : 23). "మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థా

నమును కలిగెను" (1 కొరింథీ 15 : 21). దేవుని చట్టాన్ని మానవుడు ఉల్లంఘించినప్పుడు దేవుని నిందించవలసిన పనిలేదు. మానవుడు దేవుని ప్రాకృతిక, నైతిక చట్టాన్ని అతిక్రమించినప్పుడు తన తప్పును బట్టి బాధ పడక తప్పదు. "మానవుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును" (గలతీ 6 : 7). దేవుడు "యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచున్నాడు" (2 పేతురు 3:9). "దేవుడు లోకము నెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3 : 16). ఈ జగత్తు సృష్టింపబడకముందే దేవుడు మన రక్షణను సిద్ధపరచెను (ఎఫెసి 1 : 1-6). దేవుడే నన్నీలాగు తయారు చేశాడని చెప్పి బుద్ధిహీనంగా మనం దేవుని నిందించరాదు. నిజానికి మనలను మనమే ఈలాగు చేసికొన్నాము!

## ఎంచుకోవడం మానవుని ప్రత్యేకత

ఎంచుకొనే శక్తిని దేవుడు మన కిచ్చాడు. ఆయన అట్లు చేయక పోతే మనం జంతువులలాగే యుందుము. నిర్ణయించుకొనే శక్తిగాని, బాధ్యతగాని లేక యుందుము. మన బలహీనతలను బట్టి శోధించుటకు సాతానుడు ఎల్లవేళలా ప్రయత్నించు చున్నాడు. దేవుని నుండి తొలగి మన ఆత్మలను పాపములో పడవేయుట సులభమే. మనం అబద్ధా లాడతాము, బూతులు తిడతాము, యితరులను మోసగిస్తాము, దెబ్బలాడతాము, కామాతురత చూపిస్తాము, ఇంకా అట్టి వెన్నో చేస్తాము, కాని మనం యేమీ తప్పు చేయుట లేదని అనుకొంటాము. క్రైస్తవులు పాపము చేయరని కొందరంటారు. అది నిజమయితే పాపము చేయవద్దని రక్షింపబడిన వారికి దేవుడన్ని హెచ్చరికలను ఎందు కిచ్చాడు ? "కాబట్టి సహోదరులారా, శరీరాను సారముగా

ప్రవర్తించుటకు మనము శరీరమునకు ఋణస్థులము కాము. మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసినవారై యుందురు గాని ఆత్మచేత శారీర క్రియలను చంపిన యెడల జీవించెదరు" (రోమా 8 : 12-13). "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరుచేయబడి యున్నారు; కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5 : 4). "సహోదరులారా, జీవముగల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్ట హృదయము మీలో ఎవని యందైనను ఒకవేళ ఉండునేమో యని జాగ్రత్తగా చూచుకొనుడి" (హెబ్రీ 3 : 12). "నా సహోదరులారా, మీలో ఎవడైనను సత్యమునుండి తొలగిపోయి నప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్లించిన యెడల, పాపిని వాని తప్పు మార్గమునుండి మళ్లించువాడు మరణమునుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పి వేయునని తాను తెలిసికొనవలెను"(యాకో 5:19-20).

## పడిపోకూడదు

"మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును, ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయును" (గలతీ 6:7-8). గనుక "తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" (1 కొరింథీ 10 : 12). "ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి దానిని లోబరచుకొనుచున్నాను" (1 కొరి 9 : 27).

"అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధ యందును

లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు. ఆ అబద్ధికులు వాత వేయబడిన మనస్సాక్షి గలవారై వివాహము నిషేధించుచు సత్యము విషయమై అనుభవ జ్ఞానము గల విశ్వాసులు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొను నిమిత్తము దేవుడు సృజించిన ఆహార వస్తువులను కొన్నిటిని తినుట మానవలెనని చెప్పుచుందురు" (1 తిమో 4 : 1-3). "కొరుకు పుండు ప్రాకినట్టు వారి మాటలు ప్రాకును. వారిలో హుమెనైయును ఫిలేతును ఉన్నారు. వారుపునరుత్థానము గతించెనని చెప్పుచు సత్యము విషయమై తప్పిపోయి,కొందరి విశ్వాసమును చెరుపుచున్నారు" (2 తిమో 2:17-18).

## వెలుగులో నడవాలి

"అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడచిన యెడల, మనము ఆ అన్యోన్య సహవాసముగల వారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము లేనివారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు మనలో సత్యముండదు. మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" (1 యోహాను 1 : 7-10). "ప్రియులారా, మీరు ఈ సంగతులు ముందుగా తెలిసికొని యున్నారు గనుక మీరు నీతి విరోధుల తప్పు బోధవలన తొలగింపబడి, మీకు కలిగిన స్థిరమనస్సు విడిచి పడిపోకుండ కాచుకొని యుండుడి" (2 పేతురు 3 : 17).

"వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అను భవ జ్ఞానము చేత ఈలోక మాలిన్యములను తప్పించుకొనిన తరు వాత మరల వాటిలో చిక్కుబడి వాటిచే జయింపబడిన యెడల, వారి కడవరి స్థితి మొదటి స్థితి కంటె మరి చెడ్డదగును. వారు నీతి మార్గమును అనుభవ పూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధ మైన ఆజ్ఞనుండి తొలగిపోవుటకంటె, ఆ మార్గము అనుభవ పూర్వ కముగా తెలియక యుండుటయే వారికి మేలు. కుక్క తన వాంతికి తిరిగి నట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్ళి నట్టును అను నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను" (2 పేతురు 2 : 20-22).

—క్లియో జె. స్కాట్.

---

## ప్రభురాత్రి భోజనము

### ( The Lord's Supper )

"పులియని రొట్టెల పండుగలో మొదటి దినమందు శిష్యులు యేసునొద్దకు వచ్చి - పస్కాను భుజించుటకు మేము నీ కొరకు ఎక్కడ సిద్ధపరచ గోరుచున్నావని అడిగిరి. అందు కాయన - మీరు పట్టణమందున్న ఫలాని మనుష్యుని యొద్దకు వెళ్ళి - నా కాలము సమీపమై యున్నది; నా శిష్యులతో కూడ నీ యింట పస్కాను ఆచ రించెదనని బోధకుడు చెప్పుచున్నాడని అతనితో చెప్పుడనెను. యేసు తమ కాజ్ఞాపించిన ప్రకారము శిష్యులు చేసి పస్కాను సిద్ధపరచిరి ...వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని, దాని నాశీర్వదించి, విరిచి తన శిష్యుల కిచ్చి మీరు తీసికొని తినుడి, ఇది నా శరీరమని చెప్పెను. మరియు ఆయన గిన్నె పట్టుకొని కృత జ్ఞతాస్తుతులు చెల్లించి వారి కిచ్చి - దీనిలోనిది మీ రందరు త్రాగుడి.

ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్త 26 : 17-30). ఇదే ప్రభురాత్రి భోజనము. దీనిని "రొట్టె విరుచుట" అని కూడ నూతన నిబంధన వ్యవహరించుచున్నది.

ప్రభురాత్రి భోజనము క్రీస్తు సిలువ యాగమునకు సాదృశ్యముగా ఆయన ద్వారా ప్రవేశ పెట్టబడిన ఆజ్ఞయై యున్నది. పెంతెకొస్తు పండుగ దినమున బాప్తిస్మము పొందిన 3000 మందిల "అపొస్తలుల బోధ యందును సహవాస మందును రొట్టె విరుచుట యందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి". ఇందలి పదార్థములు 1 పులియని రొట్టె 2 ద్రాక్షారసము. ఇది శరీర సంబంధమైన ఆహారము కాదు. సంఘము యొక్క సత్యారాధన యందు ఇది ఒక భాగము.

## ఆచరించవలసిన దినం

ఏ దినాన దీనిని ఆచరించవలెనో లేఖనములే మనకు విశదీకరించుచున్నవి. ఈ విషయంలో మానవ నిర్ణయాలకు తావులేదు. లేఖనము చెప్పిన దినాన గాక మానవులే దీనిని ఆచరించవలసిన దినాలను నిర్ణయిస్తే లేఖనముల అధికారాన్ని వారు తమ చేతులలోనికి తీసుకొనుటయే అగును. అపొస్తలుల కార్యములు 20 : 7లో "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు, పౌలు మరునాడు వెళ్ళనై యుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను అని వ్రాయబడి యున్నది. ఆదిమ సంఘము ప్రభురాత్రి భోజనాన్ని ఆదివారమున ఆచరించుట వలన మనము అదే మాదిరిని కొనసాగించవలసి యున్నది. లేఖనాలను గౌరవించే మనము వాటి అధికారమునకు లోబడి యుండవలెను.

1 కొరింథీ 11వ అధ్యాయము నందు పౌలు దీనిని గూర్చి

ప్రస్తావించెను. "మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగు నప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించు చుందురు". ఇది ప్రభురాత్రి భోజనము యొక్క ఆత్మ సంబంధమైన ఉద్దేశ్యము. ఆశ్చర్యకరమైన వెలుగులోనికి మానవులు పిలువబడు టకు వారు ఏర్పరచబడిన వంశము, రాజులైన యాజక సమూహము దేవుని సొత్తయిన ప్రజలుగా నుండునట్లు ఆయన రక్తము ద్వారా కొనబడిన క్రైస్తవులు ఈ గొప్ప బలియాగమును జ్ఞాపకము చేసి కొనుట దేవుని చిత్తము.

## ఆచరించు విధానం

"కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెను. ఆలాగు చేసి ఆ రొట్టెను తిని ఆ పాత్రలోనిది త్రాగవలెను" (1 కొరింథీ 11 : 28). రొట్టెను తినుచు ప్రభువు శరీరమును ద్రాక్షారసము పానము చేయుచు ఆయన రక్తము జ్ఞాపకము చేసికొనవలెనని హెచ్చ రింపబడితిమి. "ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు." (1 కొరింథీ 11 : 29). ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెనని లేఖనములు బోధిస్తుంటే కొందరు మతశాఖల బోధకులు విశ్వాసులను పరీక్షించి ప్రభురాత్రి భోజనములో పాల్గొనే యోగ్యత ఎవరికి ఉన్నదో, ఎవరికి లేదో నిర్ణయించు చున్నారు. దీని వలన లేఖనముల యొక్క అధికారమును వారు తమ చేతులలోనికి తీసుకొనుచున్నారు.

వివేచింపక తిని త్రాగువాడు అంటే ఎవరైతే రొట్టెను శరీరము నకు ద్రాక్షారసమును మానవుల పాపక్షమాపణ కొరకు ప్రభువు చిందించిన నిబంధన రక్తమునకు జ్ఞాపకముగా వివేచింపక తిని త్రాగునో వాడు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు. ప్రభురాత్రి భోజ నము తీసుకొను దినమున చాలా పవిత్రముగా నుండవలెనని ఏ పాపము చేయరాదని కొందరి అభిప్రాయము. పరిశుద్ధుడు పాపము చేయుటకు

ఎప్పుడూ బైబిలు అనుమతించలేదు. ప్రభురాత్రి భోజనములో పాలు పొందు దినమున తప్ప మిగిలిన దినాలలో పాపము చేయుటకు బైబిలు అనుమతించుచున్నదా? లేదు.

కొందరి దృష్టిలో ప్రభురాత్రి భోజనము ఒక సంస్కారము. ఇట్టి పదము బైబిలు నందు కనపడదు. ఇది పరిశుద్ధుల కివ్వబడిన ఆజ్ఞ.

కొందరు ఆదివారమున ప్రభురాత్రి భోజనము నాచరించరాదని చెప్పుదురు. లేఖనములు ఇట్టి దుర్బోధలను ఖండించుచున్నవి. లేఖనములకు వ్యతిరేకముగా మాటలాడు వీరు అపవాది సంబంధులు.

లేఖనముల అధికారమునకు లోబడినవారు తప్పని పరిస్థితులలో ప్రయాణములోను, ఆరాధనలేని స్థలాలలోను ఆదివారము గడుప వలసి వచ్చినప్పుడు ప్రభురాత్రి భోజనమును సిద్ధపరచుకొని వ్యక్తిగతంగా గాని, కుటుంబంలోని విశ్వాసులుగాని ఆచరించుచున్నారు. లేఖనముల అధికారానికి లోబడుట అంటే యిదే.

క్రిస్మస్ వచ్చేసరికి ఆహ్లాదం, విందులు, వినోదాలు చెప్పనలవి కాని విశేషాలు. ఈ ఆడంబరాలన్నియు భౌతిక సంబంధమైనవే. దేవునిద్వారా నియమింపబడిన ఆజ్ఞలను విడిచిపెట్టి ప్రకృతి సంబంధమైన వాటి కొరకు మానవులు అత్యాసక్తిని కలిగి యున్నారు.

ప్రభురాత్రి భోజనము లేని ఆరాధన (ఆదివారము) సత్యారాధన కానేరదు. ఇది ఆయన వాక్య సారాంశము.

—E.K.V. ప్రసాదరావు, చేర్యేరు.

# అపొస్తలుల ద్వారా పరిశుద్ధాత్మ కార్యములు

(గత సంచిక తరువాయి)

కృపావరాలను వినియోగించుకొనే క్రమమైన పద్ధతి తెలియక కొరింథులోని సంఘంవారు సమస్యల్లో చిక్కుకున్నారు. వాటిని సరి చేయుటకు వ్రాసిన సందర్భంలో పౌలు ఆ కృపావరాలను గూర్చి యిలా అన్నాడు - "మనుష్యుల భాషలతోను దేవదూతల భాషలతోను నేను మాటలాడినను, ప్రేమలేనివాడనైతే మ్రోగెడు కంచును గణగణలాడు తాళమునై యుందును"—అంటే భాషలతో మాట్లాడుతూ మ్రోగుతున్నా, అయితే ప్రేమతో ఆ కృపావరాన్ని వాడు కొనడం లేదు మిగిలిన కృపావరాల స్థితిని కూడా తెలుసుకో!!

"ప్రవచించు కృపావరము కలిగి మర్మము లన్నియు జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను..." లేదా, "కొండలను పెకలింపగల పరిపూర్ణ విశ్వాస ముంది". దాన్ని ఎప్పుడు ఎలా వాడాలి తెలియలేదు. నన్ను నేను చూపించుకోడానికే గాని, క్షేమాభివృద్ధి కలిగించడానికి అది వాడాలను కొనడం లేదు - ప్రేముంటే అలా చేసేవాడనే! ప్రేమ లేదు గనుక నేను దాన్ని ప్రయోగించినా వ్యర్థుడనే! ఇదీ ఆ ప్రేమ సందర్భము గనుక ప్రేమ కలిగి యుండండి అనేది హెచ్చరిక!

కృపావరాలు ఎంతకాలం వుండబోతాయి?! అవి తాత్కాలికములే గదా— "ప్రేమ శాశ్వతకాల ముండును". శాశ్వతకాలం ఉండని వేవి? కృపావరములు!! "ప్రవచనములైనను నిరర్థకములగును; భాషలైనను నిలిచిపోవును; జ్ఞానమైనను నిరర్థక మగును". ఎప్పుడు? పూర్ణమైనది (క్రొత్త నిబంధన) పూర్ణము కానివి కృపావరములు!! 1 కొరింథీ 13వ అధ్యాయాన్ని దాని సందర్భం, ఉద్దేశంలో ఆలోచించినవారు బహు అరుదుగా వుంటారు. వారి సంగతి ఎలాగున్నా -

బిల్డింగ్ కట్టబడే సమయంలో పరంజీల (scafolds) ప్రాముఖ్యత, బిల్డింగ్ పని పూర్తిగా ముగించిన తరువాత వాటి పరిస్థితి ఎలాటిదో క్రొత్త నిబంధన రచనా విధానంలో కృపావరముల స్థానము అట్టిదే! కృపావరాలు యిప్పుడు వుంటాయనుకొనే వారికి దైవ నియమము తెలియదనే చెప్పాలి.

అపొస్తలులతో పరిశుద్ధాత్మ జరిగించిన కార్యక్రమంలో క్రొత్త నిబంధన రచనలను పూర్తిగా గ్రంథస్థం చేయించడం. గ్రంథ రచన పూర్తి అయ్యేవరకు అపొస్తలు లందరూ బ్రతికి లేరు. అయినా ఆయా లేఖకులు వారివారి పాత్రలను నిర్వహించే టప్పుడు పరిశుద్ధాత్మ వారితో వుండి కార్యాలను జరిగించాడు. యూదా వంటివారు తన అభిప్రాయాలను వ్రాయాలని విశేష ఆసక్తితో ప్రయత్న పడుతున్నప్పుడు, అది దైవ నియమానికి అనుకూలం కాదని భావించిన పరిశుద్ధాత్మ తన ఆలోచనను కొనసాగింపనివ్వక, తాను ఉద్దేశింపని మరియొక అంశాన్ని వ్రాయించాడు. యూదా రచనలో ఈ సంగతి చూడవచ్చు.

"సహోదరులారా మన కందరికి కలిగెడు రక్షణను గూర్చి మీకు వ్రాయవలెనని విశేషాసక్తి గలవాడనై ప్రయత్నపడు చుండగా, పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచు మీకు వ్రాయవలసి వచ్చెను" (యూదా : 3). గనుకనే—"ఎవడైనను తాను ప్రవక్తననియైనను ఆత్మ సంబంధిని యని అయినను తలంచుకొనిన యెడల నేను మీకు వ్రాయుచున్నవి ప్రభువు యొక్క ఆజ్ఞలను అతడు దృఢముగా తెలిసికొనవలెను. ఎవడైనను తెలియనివాడైతే (తెలిసినట్టు మాట్లాడకూడదు అన్నట్టు) తెలియని వానిగనే ఉండనిమ్ము" అని తన రచనలను గూర్చి తెలియజేసాడు.

పైగా ఎవని గొప్పతనాన్ని చూచియైనా, "లేఖనముల యందు వ్రాయబడి యున్న సంగతులను అతిక్రమించ కూడదని" ఆదేశించారు (1 కొరింథీ 4 : 6). ప్రకటన గ్రంథంతో క్రొత్త నిబంధన ముగిసిన తరువాత - దానితో మరి దేనిని కలుపకూడదని; దానిలోనుండి ఏమీ తీసివేయకూడదని జనులు ఖండితంగా ఆజ్ఞాపింపబడ్డారు (ప్రకటన 22 : 18-19).

కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటి యందు మరి విశేష జాగ్రత్త కలిగి యుండవలెను. ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము (మోషే ధర్మశాస్త్రం) స్థిరపరచబడినందున, ప్రతి అక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతి ఫలము పొందియుండగా, ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుట చేత ఆరంభమై, దేవుడు తన చిత్తానుసారముగా సూచక క్రియల చేతను, మహాత్కార్యముల చేతను, నానావిధములైన అద్భుతముల చేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను, వారితో (అపొస్తలులతో) కూడ సాక్ష్య మిచ్చుచుండగా వినినవారి చేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2 : 1-4).

G. దేవదానం, పెరంబూరు, మద్రాసు-12.

---

## బైబిల్ సెమినార్

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ద్వారా 1991 డిసెంబరు 3వ తేదీనుండి 8వ తేదీ వరకు గొప్ప బైబిలు సెమినార్ జరుపబడినది. ఈ సభలు కాకినాడలో నిర్మింపబడిన జె. సి. బెయిలీ బిల్డింగు నందు నిర్వహింపబడినవి. కూటములకు జనము వేల సంఖ్యలో హాజరైరి. ఈ కూటములకు ఆంధ్రప్రదేశ్ నుండియే గాక

ఉత్తర ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా మొదలగు రాష్ట్రములనుండి ప్రజలు హాజరైరి. సహో. పెరి శాతమ్‌గారు గొప్ప ఆత్మీయాహారమును వారి గంభీరోపన్యాసముల ద్వారా పటముల సహాయమున అందించిరి. ఏడాది కాయేడు సెమినార్ కు హాజరగువారి సంఖ్య అధికమగుట చూచి వచ్చిన ప్రజలందరు మిక్కిలి ముగ్ధులైరి. వాక్యము వినుటకు వచ్చిన వారికి హాలులో కూర్చుండుటకు స్థలము సరిపడక పోవుట వలన చాలా మంది గుమ్మముల యొద్దను, కిటికీల యొద్దను నిలుచుండి లోతైన భావములతో వాక్యము నందించుచున్న శాతమ్ గారిని వినుచు విభ్రాంతి నొందిరి. ఆరు దినముల కూటములలోను మొత్తం 236 మంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. వారిలో 17 మంది మతశాఖల బోధకులుండుట గొప్ప సంగతి.

సెమినార్ కు హాజరైన వారందరికి రుచికరమైన వేడివేడి ఆహారము ఉచితముగా అందించబడినది. ఆహారమును వడ్డించుటలో స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థులును కొందరు సువార్తికులును మిక్కిలి సహాయ పడిరి.

ఈ కూటములకు అయిన ఖర్చులకు సహాయముగా స్థానిక సంఘము 8-12-91 ఆదివారము వచ్చిన చందాను, అదనముగా వెయ్యి రూపాయలను యిచ్చిరి. మరియు పలు ప్రాంతముల నుండి వచ్చిన సంఘములు, వివిధ వ్యక్తులు వారి గుప్పెటలను విప్పి విరివిగా విరాళము లందించిరి. మరి కొందరు వస్తు రూపేణ కూడ తోడ్పడిరి.

సెమినార్ విజయ వంతముగా నిర్వహింపబడుటకు తోడ్పడిన స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ లెక్చరర్స్ అగు సోదరులు బి. విజయకుమార్, డి. చిరంజీవి గార్లు, ప్రీచర్ గా వున్న డి. పద్మనాభం గారు ప్రశంసనీయులు.

ఉదారముగా కానుకలిచ్చి తోడ్పడిన సోదర సోదరీ లందరకు నా కృతజ్ఞతలు. వ్యయ ప్రయాసలకోర్చి దేవుని వాక్యమును వినుటకు సెమినార్‌కు వచ్చి దీనిని విజయవంతము గావించిన మీ అందరకు నా హృదయపూర్వక వందనములు. అనకాపల్లి, తుమ్మపాల క్రీస్తు సంఘముల నుండి సోదర సోదరీలు అధిక సంఖ్యలో హాజరై రికార్డును సృష్టించి మంచి ఆత్మీయ గీతములను వినిపించి మనకు ప్రోత్సాహ మిచ్చిరి. వారికికూడ నా వందనములు.

ఈ సంవత్సరము డిసెంబరు 7వ తేదీ సోమవారము నుండి 13వ తేదీ ఆదివారము వరకు బైబిల్ సెమినార్ జరుపబడును కావున ఇప్పటి నుండే ఆ సెమినార్ కొరకు మీ ప్రార్థనలందు జ్ఞాపక ముంచుకొన వలెనని నా మనవి.

## మద్రాసు బైబిల్ సెమినార్

కాకినాడ బైబిల్ సెమినార్ ముగిసిన తరువాత మద్రాసులో 9-12-91 న ఒక దినపు బైబిల్ సెమినార్ సైదాపేట కమ్యూనిటీ హాలునందు సహో. K. మల్లిక్ గారి ఆధ్వర్యమున గంభీరముగా జరిగినది. ఇది మహానగరమైనను సోదరులు పెర్రి కాతమ్‌గారి వాక్యము వినుటకు అయిదు వందలమందికి పైగా జనులు హాజరైరి. మల్లిక్ గారు చక్కటి ఏర్పాట్లతో దీనిని విజయవంతము గావించిరి. వాక్యము వినిన వారిలో 17 మంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. మద్రాసు నగరమందు సోదరులు మల్లిక్‌గారు చేయుచున్న బలమైన పనికి ఈ సెమినార్ ఎంతో ప్రోత్సాహము నిచ్చినది.

ఈ సంవత్సరము డిసెంబరు 14వ తేదీ సోమవారము నుండి 16వ తేదీ వరకు మద్రాసు నందు బైబిలు సెమినార్ జరుపబడును. ఈ సెమినార్‌గూడ సోదరులు మల్లిక్‌గారు విజయవంతముగా జరిగించు నట్లు మన అందరి ప్రార్థనలలోను జ్ఞాపక ముంచుకొందము.

—నెహెమ్యా గూటం.

* * *

డిశంబరు నెల 27వ తేదీ శుక్రవారంనాడు డెల్టా ఏరియా సువార్తికుల సమావేశం రాజోలు తాలూకా కడలి గ్రామంలో అత్యంత జయప్రదంగా జరిగింది. ఈ సమావేశమునకు పలుప్రాంతముల నుండి ఇంచుమించు వందమంది సువార్తికులు హాజరయ్యారు. గత సమావేశంలో ప్రారంభించబడిన "ప్రేమయందు అతుకబడుట" యను అంశమును సహోదరులు మరింత లోతుగా చర్చించిరి. ఈ సమావేశమునకు సోదరులు నెహెమ్యా గూటం గారు, వారితో బాటు మద్రాసునుండి వచ్చిన సోదరులు కె. మల్లిక్ గారు హాజరై ఆత్మీయ భావములతో కూడిన పాఠముల నందించిరి. మల్లిక్ గారు డెల్టాలో జరుగుచున్న గొప్ప పనిని చూచి సోదరుల నభినందించిరి. సమావేశానంతరం 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రాత్రివేళ సువార్తకూటానికి వందలాది ప్రజలు హాజరై దేవుని సత్యవాక్యము ఉన్నది ఉన్నట్టుగా బోధింపబడుట విని ఆనందభరితులైరి. కడలి ఏరియాలో సోదరులు పి. చిన్నయ్యగారు దేవుని కొరకు గొప్ప పనిని జరిగించుచు రాజోలు తాలూకాలో బలమైన క్రీస్తు సంఘములను నెలకొల్పుచున్నారు. అందులకై చిన్నయ్యగారు అభినందనీయులు.

Regd. No. H/KD—45/KD H.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To